సాక్షి కామారెడ్డి

మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



బీఆర్ఎస్ వైపే..

ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని, కేసీఆర్ మరోసారి సీఎం కావడం ఖాయమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ పేర్కొన్నారు.

- 10లో ▸



సజావుగా సాగేలా..

ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి మనుచౌదరి సూచించారు.

- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.3 /18.7

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రేపు కామారెడ్డికి కేటీఆర్!



సాక్షి, కామారెడ్డి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ బుధవారం కామారెడ్డికి రానున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఆయన పార్టీ ముఖ్య నేతలతో సమావేశమవుతారని సమాచారం. నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండగా.. కేటీఆర్ ఇన్‌చార్జీ బాధ్యతలు తీసుకున్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్దన్‌తో పాటు ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డిలు కూడా ఇన్‌చార్జీలుగా ఉన్నారు. ఇటీవల నియోజకవర్గానికి చెందిన నేతలతో ప్రగతిభవన్‌లో సమావేశం నిర్వహించాల్సి ఉండగా.. మంత్రి ప్రశాంత్‌రెడ్డి తల్లి మరణంతో ఆ సమావేశాన్ని వాయిదా వేశారు. దీంతో నియోజకవర్గంలోని ముఖ్య నేతలను సమావేశపరిచి, వారి మధ్య సమన్వయం కుదిర్చేందుకు మంత్రి కేటీఆర్ కామారెడ్డికి వస్తున్నారని తెలిసింది. బుధవారం మధ్యాహ్నం తర్వాత సమావేశం ఉండే అవకాశాలున్నాయి.

'షబ్బీర్ అలీ బరిలో ఉంటారు'

కామారెడ్డి టౌన్: కా మారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ మంత్రి షబ్బీర్ అలీనే బరిలో ఉంటా రని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కామారెడ్డినుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నా ఓడి పోతారని, షబ్బీర్ అలీనే గెలుస్తారని సర్వే లు స్పష్టం చేస్తుండడంతో బీఆర్ఎస్ నేతలకు నిద్ర పట్టడం లేదన్నారు. ప్రజాక్షేత్రంలో ఎదుర్కొనే ధైర్యం లేక కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇలాంటి జిమ్మిక్కులు ఎన్ని చే సినా కాంగ్రెస్ గెలుపును అడ్డుకోలేరన్నారు. బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

గోలిలింగాలకు కేంద్ర సచివాలయ ఉద్యోగులు



నాగిరెడ్డిపేట: కేంద్ర సచివాలయంలోని వివిధ విభాగాలలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారులుగా ఇటీవల ఉద్యోగాలు పొందిన అధికారులు శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర సచివాలయ ఉద్యోగులు సచిన్, షాదాబ్, వికాస్, సౌరబ్, హమిత్ సోమవారం నాగిరెడ్డిపేట మండలంలోని గోలిలింగాల గ్రామానికి చేరుకున్నారు. ఐదురోజులపాటు గ్రామంలోనే ఉండి ప్రభుత్వ పథకాల అమలుతీరును అధ్యయనం చేయనున్నారు. వారికి అవసరమైన ఏర్పాట్లను పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడ్ చేశారు.

రేపటివరకు దరఖాస్తుకు అవకాశం

కామారెడ్డి అర్బన్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ ఇవ్వనున్నారు. ఇందుకోసం ఆసక్తిగల అభ్యర్థులు బుధవారంలోగా దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ నిజామాబాద్ డైరెక్టర్ సీహెచ్.వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ సుభాష్‌నగర్‌లోని నిర్మల హృదయ స్కూల్ ఎదురుగా ఉన్న స్టడీ సర్కిల్‌లో నేరుగాగానీ, www.tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారాగానీ దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 08462–241055 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రూ.8.63 లక్షలు స్వాధీనం

కామారెడ్డి క్రైం: ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. సోమవారం కామారెడ్డి హౌజింగ్‌బోర్డు కాలనీ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో రూ.8,63,900 లను గుర్తించారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ బృందానికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

ఏఐసీసీ పరిశీలకుల రాక

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లాలో రాహుల్ గాంధీ పర్యటన ఖరారైన నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించేందుకు ఏఐసీసీ పరిశీలకులు సోమవారం వచ్చారు. ఆర్మూర్‌లో సభ, చెరుకు, పసుపు రైతులతో సమావేశం జరిగే ప్రాంతాలను ఏఐసీసీ పరిశీలకులు విష్ణునాథ్, రోహిత్ చౌదరి, కాంగ్రెస్ రాష్ట్ర నేత వేంనరేందర్‌రెడ్డి పరిశీలించారు. మంగళవారం ఉదయం బోధన్, నిజామాబాద్ అర్బన్‌లలో రాహుల్ గాంధీ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

అయోమయం..

- షబ్బీర్ అలీ నియోజకవర్గం మారుతున్నారంటూ ప్రచారం
- అదేమీ లేదంటున్న పార్టీ నేతలు
- తొలి జాబితాలో జిల్లాకు మొండి'చెయ్యి'పై శ్రేణుల్లో జోరుగా చర్చ



అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన తొలి జాబితాలో జిల్లాకు చోటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. మరోవైపు పార్టీ టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న నేతలు నియోజకవర్గాలు మారుతారంటూ జరుగుతున్న ప్రచారం మరింత గందరగోళానికి గురిచేస్తోంది.

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక కోసం కాంగ్రెస్ ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. అనంతరం స్క్రీనింగ్ పేరుతో ఆ పార్టీ హంగామా చేసింది. కామారెడ్డి నియోజకవర్గంనుంచి టికెట్టు ఆశిస్తోంది ఒక్క షబ్బీర్ అలీనే కావడంతో ఆయన పేరు తొలి జాబితాలోనే ఉంటుందని పార్టీ నేతలు భావించారు. ఇక్కడి నుంచి పోటీ చేయడానికి ఆయన అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పటికే ఒక దఫా ఊర్లన్నీ చుట్టేశారు. సీఎం కేసీఆర్ పోటీ చేస్తారని ప్రకటించినప్పటికీ ఎక్కడా తగ్గకుండా తన ప్రచారాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలతో సమావేశాలు అవుతూ ఎన్నికల్లో మద్దతు కూడగట్టే పనిలో ఉన్నారు. అయితే ఆదివారం ప్రకటించిన తొలి జాబితాలో షబ్బీర్ అలీ పేరు లేకపోవడంతో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో వదంతులు షికార్లు చేస్తున్నాయి. సామాజిక మాధ్యమాలతో పాటు కొన్ని మీడియాలో రకరకాల వార్తలు ప్రసారం అవుతున్నాయి. కామారెడ్డినుంచి అధికార పార్టీ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నందున ఆయనపై పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి బరిలో నిలుస్తాడని, షబ్బీర్ అలీ ఎల్లారెడ్డి నియోజకవర్గానికి వలస వెళ్తారని ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా గుర్తింపు ఉన్న షబ్బీర్ అలీ నియోజకవర్గం మారుతారన్న ప్రచారంతో కాంగ్రెస్ శ్రేణులు అయోమయానికి, ఆందోళనకు గురవుతున్నాయి. అసలేం జరుగుతుందోనంటూ షబ్బీర్ అలీని కలిసి అడిగే ప్రయత్నం చేస్తున్నారు. ఏం జరిగిందో తెలుసుకోవడానికి కొందరు నేతలు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడినట్లు తెలిసింది. అభ్యర్థుల విషయంలో జరుగుతున్న ప్రచారంపై డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ స్పందించారు. షబ్బీర్ అలీ కామారెడ్డి నియోజకవర్గం నుంచే పోటీ చేస్తారని, ఒకటి రెండు రోజుల్లో అభ్యర్థులను ప్రకటిస్తారని పేర్కొన్నారు. కార్యకర్తలు ఆందోళనకు గురికావద్దని కోరారు.

ఎల్లారెడ్డిలోనూ అదే పరిస్థితి..

కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉన్న ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అనిశ్చితి కొనసాగుతోంది. ఇక్కడ సుభాష్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావు టికెట్లు ఆశిస్తున్నారు. పార్టీ అభ్యర్థిత్వం కోసం ఇద్దరూ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సుభాష్‌రెడ్డికి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, షబ్బీర్‌అలీ పూర్తి స్థాయిలో అండగా నిలిచారు. మదన్‌మోహన్‌రావుకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సపోర్ట్ చేస్తూ ఆయన అభ్యర్థిత్వం ఖరారు చేయాలని పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. ఇద్దరిని కాదని మూడో వ్యక్తికి అవకాశం ఇస్తారన్న ప్రచారం కూడా జరిగింది. దీంతో ఇరువురి అనుచరులు అయోమయానికి గురవుతున్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ అభ్యర్థి విషయంలోనూ పార్టీ అధిష్ఠానం ఎటూ తేల్చలేదు. ఇక్కడ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాలరాజు పార్టీ టికెట్టుకోసం ప్రయత్నిస్తున్నారు. ఆయన వ్యతిరేకవర్గం సైతం పార్టీ అభ్యర్థిత్వం ఆశిస్తోంది. కాగా వీరిని కాదని వేరేవారికి అవకాశం ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమైంది. ఆయన మొదట ఎల్లారెడ్డి టికెట్టు అడిగినా.. సాధ్యం కాదని చెప్పిన పార్టీ రాష్ట్ర నాయకత్వం బాన్సువాడనుంచి పోటీ చేయాలని ప్రతిపాదించినట్లు తెలిసింది. దీంతో ఇక్కడా కాంగ్రెస్ శ్రేణుల్లో అదే గందరగోళ పరిస్థితి నెలకొంది.

ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారామ్‌కే అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు. ఆయన ఇప్పటికే ఎన్నికల ప్రచారాన్ని సైతం షురూ చేశారు. పార్టీ కార్యాలయాలను ప్రారంభిస్తూ, కార్యకర్తల సమావేశాలను నిర్వహిస్తున్నారు. మిగతా మూడు నియోజకవర్గాల్లో మాత్రం ఉత్కంఠ కొనసాగుతోంది.

ప్రతిపక్షాలకు అభ్యర్థులు కరువయ్యారు



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- బీఆర్ఎస్ మేనిఫెస్టోపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉంది
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి మెజార్టీ స్థానాల్లో ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులే కరువయ్యారని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన బాన్సువాడలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. కరోనా సంక్షోభం వచ్చినా గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని, సంక్షేమ పథకాలు ఆపలేదని పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అక్కడ ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాత తెలంగాణలో ఓట్లు అడిగితే ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. ఆ పార్టీ నాయకులు గ్యారంటీల పేరుతో గారడీ చేస్తున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణలో గెలిచి హ్యాట్రిక్ సాధిస్తామన్న ధీమా వ్యక్తం చేశారు. బీఫాం ఇవ్వడమే కాకుండా ఎన్నికల ఖర్చుకోసం రూ.40 లక్షల పార్టీ ఫండ్ ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతుబంధు జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గోపాల్‌రెడ్డి, గురువినయ్, జుబేర్, జిన్న రఘు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొడతాం

- కామారెడ్డినుంచే పోటీ చేస్తా
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌పై ఎన్ని కుట్రలు చేసినా గెలవలేరని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. కామారెడ్డిలో ప్రజలు సీఎం కేసీఆర్‌ను ఓడించడం ఖాయమన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కామారెడ్డి పట్టణానికి చెందిన బీజేపీ మైనారిటీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్, మాచారెడ్డి మండలం ఎల్లంపేట, వెనుకతండా, బోడగుట్ట తండా, దోమకొండ మండలం సంగమేశ్వర గ్రామానికి చెందిన విశ్వబ్రహ్మ సంఘ సభ్యులు, బీబీపేట్ మండలం కోనాపూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు భయభ్రాంతులకు గురిచేస్తూ పంచాయతీలతో అధికార పార్టీకి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు చేయిస్తున్నారని ఆరోపించారు. అయినా ప్రజలు బీఆర్ఎస్ నేతలకు షాక్ ఇస్తూ తీర్మానాలు చేసిన గ్రామాల నుంచి కూడా భారీగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను బీఆర్ఎస్ పూర్తిగా కాపీ కొట్టిందని తేలిపోయిందన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోల అమలుకే దిక్కులేదన్నారు. ఇప్పుడు మళ్లీ ప్రజల్ని మోసం చేయడానికి దొర వచ్చాడని ఎద్దేవా చేశారు. తాను కామారెడ్డి గడ్డమీద నుంచే పోటీ చేస్తానని, తనపై ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. కామారెడ్డిలో గెలిచేది, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే అన్నారు.

'సమన్వయంతో పనిచేయాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఎన్నికల అధికారులు సమన్వయంతో, సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో వీడియో కాన్ఫరెన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను ఈనెల 19 లోగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉందని, అనంతరం అనుబంధ ఓటరు జాబితా సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో పోస్టల్ శాఖ ద్వారా ఎపిక్ కార్డుల పంపిణీ ఎలా జరుగుతుందన్న అంశంపై దృష్టి సారించాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచాలని, డబ్బు, మద్యం, కానుకలు రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని సూచించారు. తహసీల్దార్లు, సెక్టోరల్ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని, రూట్ మ్యాప్ ఆధారంగా అన్ని పోలింగ్ బూత్‌లను పరిశీలించాలని పేర్కొన్నారు. అవసరమున్న చోట పంచాయతీ కార్యదర్శుల సేవలను వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఓటరు అవగాహన నిమిత్తం తప్పనిసరిగా 4 రకాల పోస్టర్లు ప్రదర్శించాలన్నారు. పోలింగ్ శాతం తక్కువగా ఉన్న కేంద్రాలపై దృష్టి పెట్టాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో అసత్యపు వార్తలు రాకుండా కట్టడి చేయాలన్నారు. ఏ సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలని, సొంత నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, రిటర్నింగ్ అధికారులు మనుచౌదరి, ప్రభాకర్, శ్రీనివాస్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జోనల్ స్పోర్ట్స్ మీట్



క్యాంప్‌ఫైర్ వద్ద విద్యార్థినుల సందడి



క్రీడా పోటీల విజేతలతో అధికారులు

బాన్సువాడ రూరల్: బోర్లం క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఈనెల 13న ప్రారంభమైన జోనల్ స్పోర్ట్స్‌మీట్ సోమవారం ముగిసింది. అండర్ 14, 17, 19 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. మూడోజోన్ పరిధిలోని కామారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు చెందిన 1275 మంది పోటీపడ్డారు. ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గురుకుల విద్యాలయ సంస్థ స్పోర్ట్స్ ఆఫీసర్ రామలక్ష్మణ్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఆర్‌సీవో అలివేలు, డీసీవో కృతామూర్తి, ఇంటర్ నోడల్ ఆఫీసర్ షేక్ సలాం, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్‌లతో కలిసి విజేతలకు మెడల్స్ అందించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో గురుకులాల ప్రిన్సిపల్స్ పద్మకుమారి, శోభారాణి, లక్ష్మీబాయి, పుష్పలత, నళిని, సవిత, స్వప్న, భువనేశ్వరి, నరసింహారెడ్డి, సత్యనారాయణ, శివరాం, పూర్ణచంద్రరావు, హెస్సీ, కల్పనా దేవసాని తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

కదనానికి బీజేపీ సన్నద్ధం

- ఎన్నికల కోసం సన్నాహక సమావేశాలు
- నియోజకవర్గాల వారీగా ఏర్పాటు
- శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్న నేతలు



కామారెడ్డి సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల సమరానికి పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి బీజేపీ సిద్ధమైంది. నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తోంది. సోమవారం కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో సమావేశాలు జరిగాయి. పార్టీ రాష్ట్ర నాయకులతో పాటు పార్లమెంట్ ప్రభారీలు పాల్గొని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జుక్కల్ నియోజకవర్గం సమావేశం మంగళవారం జరగనుంది. ఆయా నియోజకవర్గాల్లో ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన బీజేపీ నాయకత్వం వాటిని పరిశీలించింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ రెండు మూడు రోజుల్లో కొలిక్కి వస్తుందని చెబుతున్నారు. అయితే పార్టీ శ్రేణులను సమన్వయం చేయడంతో పాటు ఎన్నికలకు సమాయత్తం చేయడానికి నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన నిధులు, పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఓట్లు అడగాలంటూ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న సమావేశాలకు పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలంతా హాజరయ్యారు.

కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి

ఎల్లారెడ్డి: ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, కర్ణాటకలోని బెల్గాం ఎమ్మెల్యే అభయ్‌పాటిల్ పిలుపునిచ్చారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని వీకేవీ కన్వెన్షన్ హాల్‌లో ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి, జిల్లా నాయకులు బాపురెడ్డి, పైల కృష్ణారెడ్డి, బాలకిషన్, దేవేందర్, బైండ్ల పోచయ్య, ఎస్ఎన్‌రెడ్డి, కుర్మ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అవినీతిని ఎండగట్టాలి

- కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బెల్గాం ఎమ్మెల్యే అభయ్ పాటిల్



కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అవినీతిని గ్రామగ్రామాన ఎండగట్టాలని జహీరాబాద్ పార్లమెంట్ ప్రభారి, కర్ణాటకలోని బెల్గాం నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభయ్ పాటిల్ పార్టీ శ్రేణులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో నియోజకవర్గ ముఖ్య నాయకులతో మిషన్ తెలంగాణ ఎన్నికల సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలే బీజేపీకి బలమన్నారు. కార్యకర్తలు ప్రతి ఓటరును కలిసి పోలింగ్ శాతం పెరిగేలా, బీజేపీకి ఓటు పడేలా చేడాలన్నారు. పన్నా ప్రముఖ్‌లు ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తారన్నారు. తెలంగాణలో గ్రామగ్రామాన జరిగిన అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులే కారణమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కామారెడ్డిలో కేసీఆర్‌పై బీజేపీ గెలుపు ఖాయమని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ ఓటమి భయంతోనే ఇక్కడ కొడుకు కేటీఆర్‌తోపాటు ఒక ఎమ్మెల్సీని ఇన్‌చార్జీగా పెట్టుకున్నారని విమర్శించారు. ఎంత మంది ఇన్‌చార్జీలు వచ్చినా బీజేపీ గెలుపును ఆపలేరన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తేలు శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, నాయకులు శ్రీనివాస్, సంధ్య, శ్రీకాంత్, విపుల్, రాజు, రాజేష్, ఆనంద్‌రావు, గంగారెడ్డి, నరేందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అమరవీరులకు డీసీపీ నివాళి



ఖలీల్‌వాడి: పోలీసు అమరవీరుల వారోత్స వాల సందర్భంగా కమిషనరేట్ పరిధిలోని అమరులైన పోలీసు కుటుంబాలను అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) జయరాం సోమవారం పరామర్శించారు. పోలీస్ సిబ్బంది వారి కుటుంబసభ్యులను కలిసి అమరుల ఫొటోలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులతో ప్రభుత్వం నుంచి అందిన సహాయ సహకారాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ నరహరి, ఎస్‌బీ సీఐ జె.గన్వంతర్‌రావు, ఏఎస్సై రాఘవేందర్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్ పాషా ఉన్నారు.

తంగేడు పూవుల్ల చందమామ..



తంగేడు పూవుల్ల చందమామ
బతుకమ్మ పోతుంది చందమామ
పోతే పోతివిగాని చందమామ
మళ్లెప్పుడొస్తావు చందమామ
యాదాదికోసారి చందమామ
నువ్వొచ్చిపోవమ్మ చందమామ
బీరాయి పూవుల్ల చందమామ
బతుకమ్మ పోతుంది చందమామ
గునుగియ పూవుల్ల చందమామ
బతుకమ్మ పోతుంది చందమామ
పోతే పోతివిగాని చందమామ
మళ్లెప్పుడొస్తావు చందమామ
యాదాదికోసారి చందమామ
నువ్వొచ్చిపోవమ్మ చందమామ
కాకర పూవుల్ల చందమామ
బతుకమ్మ పోతుంది చందమామ
పోతే పోతివిగాని చందమామ
మళ్లెప్పుడొస్తావు చందమామ
యాదాదికోసారి చందమామ
నువ్వొచ్చిపోవమ్మ చందమామ
కట్లాయి పూవుల్ల చందమామ
బతుకమ్మ పోతుంది చందమామ
పోతే పోతివిగాని చందమామ
మళ్లెప్పుడొస్తావు చందమామ
యాదాదికోసారి చందమామ
నువ్వొచ్చిపోవమ్మ చందమామ
రుద్రాక్ష పూవుల్ల చందమామ
బతుకమ్మ పోతుంది చందమామ
పోతే పోతివిగాని చందమామ
మళ్లెప్పుడొస్తావు చందమామ
యాదాదికోసారి చందమామ
నువ్వొచ్చిపోవమ్మ చందమామ
గుమ్మడి పూవుల్ల చందమామ
బతుకమ్మ పోతుంది చందమామ
పోతే పోతివిగాని చందమామ
మళ్లెప్పుడొస్తావు చందమామ
యాదాదికోసారి చందమామ
నువ్వొచ్చిపోవమ్మ చందమామ

– నిజామాబాద్ సిటీ

బీఆర్‌ఎస్ వైపే ప్రజలు



లింగంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్



హాజరైన కార్యకర్తలు

- కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయం
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్, నియోజకవర్గ ఇన్‌చార్జి వీజీగౌడ్

గాంధారి: తెలంగాణ పథకాలు దేశానికే దిక్సూచిగా మారాయని, రాష్ట్ర ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్, నియోజకవర్గ ఇన్‌చార్జి వీజీగౌడ్ అన్నారు. సోమవారం వారు మండలంలో పర్యటించారు. స్థానిక హరాశే గార్డెన్స్‌లో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కేసీఆర్ జన రంజక పాలన చేశారని, అన్ని వర్గాల సంక్షేమం కోసం పథకాలు ప్రవేశపెట్టారన్నారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో చూసి కాంగ్రెస్, బీజేపీలు ఖంగు తిన్నాయన్నారు. జెడ్పీటీసీ శంకర్ నాయక్, మాజీ జెడ్పీటీసీ తానాజీరావు, ఏఎంసీ చైర్మన్ సత్యంరావు, డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్, సర్పంచ్ సంజీవ్, ఎంపీటీసీ పత్తి శ్రీనివాస్, బలరామ్ నాయక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ జెండా ఎగరేస్తాం

లింగంపేట: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగరవేస్తామని ఎమ్మెల్యే జాజాల సురేందర్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన లింగంపేటలోని జీఎస్‌ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన నియోజక వర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే ప్రజలకు అందుబాటులో ఉండి ఆపద సమయాల్లో ఆదుకున్నట్లు పేర్కొన్నారు. మరోసారి అవకాశం ఇస్తే సేవకునిగా పని చేస్తానన్నారు. తన లక్ష్యం ఎల్లారెడ్డి నియోజక వర్గ అభివృద్ధే అన్నారు. బూత్ లేవల్ కార్యకర్తల నుంచి ప్రతీ కార్యకర్త ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రోజుల్లో పేదలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడనే కేసీఆర్ లక్ష్యమన్నారు.

బీజేపీని ప్రజలు నమ్మరు

దిశా నిర్దేశం లేని బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ వెల్లడించారు. లింగంపేటలో బూత్ లెవల్ నియోజక వర్గ స్థాయి సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. మూడో సారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధిస్తుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు మన తెలంగాణలో కేసీఆర్ ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఉనికిని కోల్పోయిందన్నారు. ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేసి సురేందర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, జెడ్పీటీసీలు మనోహర్‌రెడ్డి, శంకర్‌నాయక్, హన్మండ్లు, ఉషగౌడ్, ఆయా మండలాల ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కమిటీ, బూత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వార్థం లేకుండా సేవ చేశా

- సామాన్యుడి కోసం బీఆర్‌ఎస్ మేనిఫెస్టో
- ఎమ్మెల్యే హన్మంత్ సింధే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్‌సింధే

బిచ్కుంద: ఎలాంటి స్వార్థం లేకుండా 15 ఏళ్లుగా జుక్కల్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తున్నట్లు ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. సోమవారం బిచ్కుందలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో నిరుపేదల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. మళ్లీ అధికారంలోకి వస్తే రూ.400 గ్యాస్ సిలిండర్, ఆసరా పింఛన్ల పెంపు, ప్రతి కుటుంబానికి ఐదు లక్షల జీవిత బీమా సౌకర్యం, సౌభాగ్య లక్ష్మి పథకంతో నిరు పేద మహిళలకు మూడు వేల భృతి అందిస్తామన్నారు. నియోజకవర్గంలో వేల కోట్లతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. 80 గ్రామాల్లో బీటీ రోడ్లు వేసినట్లు పేర్కొన్నారు. బిచ్కుంద, పిట్లం, మద్నూర్, పెద్దకొడప్‌గల్ మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. ప్రజలు ఆశీర్వదించి నాలుగో సారి తనను గెలిపించాలని కోరారు. కార్యకర్తలు మేనిఫెస్టోను ప్రజలకు వివరించి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు, ఎంపీపీ అశోక్ పటేల్, కొడప్‌గల్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, నాయకులు నాల్చర్ రాజు, మాధవరావు, వెంకట్‌రావు, బాలు పాల్గొన్నారు.

బోధన్ టు కర్ణాటక

- మిర్యాలగూడ నుంచి వస్తున్న దళారులు
- అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు సరఫరా

రెంజల్: ఈ సీజన్‌లో వర్షాలు ఆలస్యమైనా వరి సాగు చేసిన రైతుల్లో ఆనందం వ్యక్త మవుతోంది. స్థానికేతర వ్యాపారులతో ఇప్పటికే రైతులు ఆశాజనకమైన ధరకు ధాన్యం విక్రయిస్తున్నా రానురాను పరిస్థితి ఎలా ఉంటుందోనని వరి పొట్టదశలో ఉన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ముందుగా వరి నాట్లు పూర్తి చేసిన ప్రాంతాల్లో రైతులు వారం, పది రోజుల నుంచి నూర్పిళ్లు చేపట్టగా మిర్యాలగూడకు చెందిన ప్రైవేట్ వ్యాపారులు పంటపొలాల వద్దకే వచ్చి పచ్చిధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలుకు 3 కిలోల తరుగు తీసుకుని ప్రభుత్వ మద్దతు ధరకన్నా అదనంగా చెల్లిస్తుండడంతో పాటు రైతులకు హమాలీ, గన్నీ బ్యాగుల డబ్బులు దక్కుతున్నాయి. స్థానికేతర వ్యాపారులు ఈ ప్రాంత రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని కర్ణాటకకు తరలిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఈ సీజన్‌లో వరి మద్దతు ధర ఏ–గ్రేడ్ రకానికి రూ.2203, బీ–గ్రేడ్ రకానికి రూ.2183గా నిర్ణయించింది. మిర్యాలగూడ వ్యాపారులు క్వింటాలుకు 3 కిలోల తరుగు తీసుకుని రూ. 2200 నుంచి 2400 వరకు చెల్లిస్తున్నారు. దీంతో రైతుకు ధాన్యాన్ని ఆరబెట్టడం, గన్నీ బ్యాగుల కోసం పరుగులు, కేంద్రాల వద్ద రోజుల తరబడి నిరీక్షణ తప్పుతోంది.

కొనుగోళ్లకు ముందుకురాని దళారులు

పెట్టుబడి లేని వ్యాపారం కావడంతో గ్రామాల్లో దళారులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. గతంలో పలువురు రైతులను నిలువునా ముంచి చివరకు డబ్బులు చెల్లించక ఐపీలు తీసుకొన్న ఘటనలున్నాయి. జిల్లాలో మొదటిసారిగా మిర్యాలగూడ నుంచి వ్యాపారులు వచ్చి రైతులకు అదనపు ధర అందిస్తుండడంతో దళారులకు గిట్టుబాటు దక్కక కొనుగోళ్లకు ముందుకు రావడం లేదు. ఇతర రాష్ట్రాలకు చెందిన మిల్లర్లు మిర్యాలగూడ వ్యాపారుల ద్వారా ఇక్కడి నుంచి ధాన్యాన్ని తరలించుకుపోతున్నారు. మరి కొందరు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి కమీషన్ చూసుకుని విక్రయిస్తున్నారు.

ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలి



మద్నూర్‌లో ఎన్నికల సిబ్బందితో సమావేశమైన రిటర్నింగ్ అధికారి మనుచౌదరి

మద్నూర్: శాసన సభ ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి మను చౌదరి సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం ఎన్నికల అధికారులు, సిబ్బందితో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి సిబ్బంది సహకరించాలన్నారు. ర్యాలీలు, బహిరంగ సభలు, ఇతర కార్యక్రమాల కోసం అనుమతి తప్పనిసరని చెప్పారు.

స్ట్రాంగ్ రూంల పరిశీలన

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూం ఏర్పాటు, నామినేషన్ ప్రక్రియ, వివిధ ఏర్పాట్ల గురించి ఎన్నికల రిటర్నింగ్ అధికారి మను చౌదరి పరిశీలించారు. మద్నూర్‌లోని స్ట్రాంగ్ రూం పరిసరాల్లో పకడ్బందీ నిఘా కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వీటితో పాటు అంతరాష్ట్ర చెక్‌పోస్ట్, జిల్లా చెక్‌పోస్టులలో నిఘా విభాగంతో పాటు వీడియో రికార్డింగ్ తీపిస్తున్నామన్నారు.

ఆన్‌లైన్‌లో నామినేషన్ వేయచ్చు

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నామినేషన్ వేయవచ్చని మను చౌదరి తెలిపారు. తహసీల్ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో కూడా నామినేషన్ వేసే విధానాన్ని ఈ సంవత్సరం తీసుకొచ్చినట్లు ఆయన తెలియజేశారు. ప్రచారానికి అనుమతులు పొందాలంటే 48 గంటల ముందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తహసీల్దార్ మహమ్మద్ ముజీబ్, డిప్యూటి తహసీల్దార్ భరత్, ఆర్‌ఐ శంకర్, సీనియర్ అసిస్టెంట్ విజయ్, సిబ్బంది ముస్తఫా, సతీష్ ఉన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచిన జిల్లా జట్టు



విజేతగా నిలిచిన జిల్లా జట్టు క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో జిల్లా మహిళా జట్టు విజేతగా నిలిచింది. ఈనెల 15, 16వ తేదీల్లో హన్మకొండ కాకతీయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఫైనల్‌లో సిద్దిపేట జట్టుపై గెలిచి చాంపియన్‌షిప్‌ను జిల్లా జట్టు కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో బెస్ట్ క్రీడాకారిణిగా జిల్లాకు చెందిన రాణిని రాష్ట్ర కార్యదర్శి నవీన్ జ్ఞాపికను అందజేసి సన్మానించారు. ఉపాధ్యక్షుడు శోభన్ బాబు క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. రాష్ట్ర జట్టుకు కోచ్ మేనేజర్‌గా వ్యవహరించిన నరేశ్, సంతోష్, గంగాధర్, సాయికిరణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్, స్పోర్ట్స్ ఆఫీసర్ ముత్తన్న, సంగీత్‌రావు, నీరజారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, నరేందర్, జైపాల్‌రెడ్డి, మర్కంటి సుజాత, చిప్ప నవీన్, సూపరి వినోద్, జైడి రాజ్ కుమార్, బక్కూరి పవన్, నాగమణి, నల్లూరి లత, ప్రేమలత, భూపతి, మధు, అనిల్, సురేశ్, స్వప్న, జ్యోత్స్న, మౌనిక పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి హారిక

నాగిరెడ్డిపేట: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎల్లారెడ్డి డివిజన్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి హారిక అన్నారు. సాధన సంస్థ ఆధ్వర్యంలో 'బాల్యవివాహ రహిత దేశం' అనే అంశంపై మండలంలోని పోచారంలో సోమవారం రాత్రి అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. పోచారం గ్రామాన్ని బాల్య వివాహ రహితగ్రామంగా మార్చాలన్నారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి స్రవంతి, స్వర్ణలత, చందన, సర్పంచ్ విజిత, ఎంపీటీసీ సభ్యురాలు వినీత, సాధన సంస్థ డైరెక్టర్ మురళీమోహన్, ఎస్సై రాజు, శ్రీనివాస్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అంతా విచిత్రమే..



ఓ రైతుగా సమావేశంలో మాట్లాడుతున్న ఆఫీస్ బాయ్ శివ

బాల్కొండ: మండలంలోని వరద కాలువ జీరోపాయింట్ వద్ద కాలుష్య నియంత్రణ మండలి నిజామాబాద్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఎన్నో చిత్ర, విచిత్రాలు చోటు చేసుకున్నాయి. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి ఎదుటే పునరుజ్జీవన పథకం పంప్ హౌస్‌లో ఆఫీస్ బాయ్‌గా పనిచేసే శివని ముందుగా రైతుగా పరిచయం చేశారు. ఆయన రైతుగానే సమావేశంలో వేదిక వద్ద వచ్చి వరద కాలువ నిర్మాణంతో తమకు మంచిగానే ఉందని.. రెండు పంటలు పండిస్తున్నామంటు తెలిపాడు. మైక్ నిర్వాహకుల చేతికి అందడమే ఆలస్యం వెంటనే సమావేశం వద్ద టీ సిద్ధం చేసి అదే అదనపు కలెక్టర్‌కు అందించాడు. అయినా అధికారులు పట్టించుకోలేదు. పంప్ హౌస్ వద్ద ఆఫీస్ బాయ్, క్లీనర్స్‌ను ముందే రైతులుగా అధికారులు తయారు చేసి మాట్లాడించారు. ఇదే ప్రజాభిప్రాయ సేకరణ అంటు అధికారులు ముగించారు. ఇదంత చూసినా అదనపు కలెక్టర్ చూస్తూ ఊరుకున్నారు. దీంతో సర్వత్రా విమర్శలు నెలకొన్నాయి.

దాడిలో ఒకరి మృతి

నవీపేట: మండల కేంద్రంలోని మార్కెట్ ప్రాంగణంలో ఆదివారం జరిగిన దాడిలో గాయపడ్డ బాధితుడు సోమవారం మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన సాయిరాం(50) కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. మార్కెట్ ప్రాంగణంలో మద్యం సేవిస్తుండగా అదే గ్రామానికి చెందిన నాగరాజు మద్యం పోయాలని బలవంతం చేశాడు. దీంతో తాను మద్యం పోయనని సాయిరాం తెలుపడంతో నాగరాజు అతని కుమారుడు గణేశ్ దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ సాయిరాం సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఘర్షణ జరిగిన ప్రాంగణాన్ని ఏసీపీ కిరణ్‌కమార్ పరిశీలించారు. మార్కెట్ ప్రాంగణంలో ఎవరైనా మద్యం సేవిస్తే కేసు నమోదు చేయాలని ఎస్సైని ఆదేశించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

చికిత్స పొందుతూ మరొకరు..



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి శివారులోని కెమికల్ ఫ్యాక్టరీలో ఈనెల 11న జరిగిన ప్రమాదంలో గాయపడ్డ కార్మికుడు జగదీశ్ పాల్(40)హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ల్యాబరేటరీలో సాల్వెంట్ డ్రమ్ములను అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ప్రమాదం సంబవించడంతో ఆపరేటర్లుగా పనిచేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన బబ్లూ అదే రోజు మృతి చెందగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన జగదీశ్‌పాల్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

క్రైం కార్నర్

బెల్ట్‌షాపులపై దాడి

ఖలీల్‌వాడి/ పెద్దకొడప్‌గల్/ మోపాల్/ ఇందల్వాయి/ బోధన్ రూరల్: నగరంలోని ఆరోటౌన్ పీఎస్ పరిధిలోని అర్సపల్లి, డైరీఫాం సమీపంలో బెల్ట్ షాపుల దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి చేసినట్లు పేర్కొన్నారు. మూడో టౌన్ పీఎస్ పరిధిలోని హమాల్‌వాడిలో చిట్టబోయిన శంకర్ ఇంట్లో రూ. 15290 విలువ చేసే మద్యం స్వాధీనం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు.

పెద్దకొడప్‌గల్ మండలంలోని బేగంపూర్‌లో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించినట్లు ఏఎస్సై రాములు పేర్కొన్నారు.

మోపాల్ మండలంలోని చిన్నాపూర్, గుడితండా, కాస్‌బాగ్‌తండాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై దాడి చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇందల్వాయి మండలంలోని గౌరారం, ఇందల్వాయి తండా, వెంగల్‌పాడ్ గ్రామాల్లో బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. దాడుల్లో మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బోధన్, సాలూర మండలాల్లోని పలు గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాప్‌లపై సోమవారం రాత్రి దాడులు నిర్వహించినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై నాగనాథ్ తెలిపారు. సాలూర, పెంటకుర్దు క్యాంపు, నాగన్‌పల్లి, కొప్పర్గ, ఊట్‌పల్లి గ్రామాల్లో బెల్ట్ షాప్‌లపై దాడులు నిర్వహించి సుమారు రూ.25వేల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కరుణవ్వ మల్లవ్వ(45) అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో విజయబాబు సోమవారం తెలిపారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం గైని గ్రామానికి చెందిన పేమయ్య, కరుణవ్వ ఇద్దరు వారం రోజుల క్రితం కూతురి అనారోగ్యం నిమిత్తం జీజీహెచ్ ఆసుపత్రికి వచ్చారు. ఆదివారం రాత్రి కరుణవ్వ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మల్లవ్వ భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

సదాశివనగర్: కుప్రియాల్ గ్రామంలో గంగపుత్ర సంఘానికి సంబంధించిన పిల్లర్లను రెడ్డి సంఘాల సభ్యులు ధ్వంసం చేశారంటు తహసీల్దార్ హిమబిందుకు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో నాలుగు రెడ్డి సంఘాలకు చెందిన భవనాలను నిర్మించుకున్నారని, తమ గంగపుత్ర సంఘానికి సంబంధించిన భవనం నిర్మించకుండా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన రెడ్డి సంఘ భవనాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. స్థలాన్ని పరిశీలించి న్యాయం చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు గంగపుత్ర సంఘం సభ్యులు తెలిపారు. సంఘం ప్రతినిధులు బట్టు గంగారాం, చిన్న నర్సింలు, రవీందర్, సుదర్శన్, నడిపి గంగయ్య, చిన్న గంగయ్య, బట్టు నర్సింలు, కిశోర్ లింగం తదితరులు పాల్గొన్నారు.

భారీగా నగదు స్వాధీనం



పోచారంలో నగదును పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

ఖలీల్‌వాడి/నాగిరెడ్డిపేట/దోమకొండ: నగరంలోని సారంగపూర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.6.87 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవీందర్ సోమవారం తెలిపారు. తనిఖీల్లో వెంకటరమణారెడ్డి అనే వాహనదారుడి నుంచి రూ.5,22,920, రాజేందర్‌గౌడ్ నుంచి రూ.1.65 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం వద్ద ఓ వ్యక్తి నుంచి రూ.80వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజు తెలిపారు. దోమకొండ మండల కేంద్రంలో కారులో ప్రయాణిస్తున్న ఒకరి నుంచి రూ. 2లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై మురళి పేర్కొన్నారు. వేల్పూర్ మండలం పడగల్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా కారులో ప్రయాణిస్తున్న జగిత్యాలకు చెందిన అనిల్‌రావు నుంచి రూ. లక్ష స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

తెగిపడిన విద్యుత్ తీగలు



చిన్నపూల్ బ్రిడ్జి వద్ద తెగిపడిన విద్యుత్ తీగలు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని వడ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ సోమవారం ఢీకొన్నది. దీంతో విద్యుత్ స్తంభం నేలకొరగడంతో కరెంట్ తీగలు ఒక్కసారి తెగి రోడ్డుపై పడ్డాయి. ఈ విషయాన్ని గమనించిన వాహనదారులు ముందుకు వెళ్లకుండా ఆగిపోయాడు. దీంతో ప్రమాదం తప్పింది. అప్పటికే కరెంట్ తీగలు ఒకదానికొటి తగిలి మంటలు చెలరేగాయి. స్తంభాన్ని ఢీకొన్న లారీ డ్రైవర్ వేగంతో అక్కడి నుంచి తప్పించుకున్నాడు. స్థానికులు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. లారీ కోసం ట్రాన్స్‌కో అధికారులు, పోలీసులు గాలిస్తున్నారు.

యంచలో చెక్ పోస్ట్ ప్రారంభం



యంచలో చెక్ పోస్టును ప్రారంభిస్తున్న ఏసీపీ

నవీపేట: మండలంలోని యంచ గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆదిలాబాద్, నిజామాబాద్ సరిహద్దు ప్రాంతంలోని ఎక్సైజ్ చెక్‌పోస్ట్ స్థానంలోనే ఈ చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహారాష్ట్రతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. నిజామాబాద్ నార్త్ జోన్ సీఐ సతీశ్, ఎస్సై యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

చీమన్‌పల్లిలో..

సిరికొండ: మండలంలోని చీమన్‌పల్లి వై జంక్షన్ వద్ద అంతర్ జిల్లా చెక్ పోస్ట్‌ను ఏసీపీ కిరణ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అక్రమంగా డబ్బు, మద్యం సరఫరాను నివారించేందుకు రాజన్న సిరిసిల్ల సరిహద్దు వద్ద చెక్ పోస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధర్పల్లి సీఐ సైదా, ఎస్సై రమేశ్ ఉన్నారు.

పలువురి బైండోవర్

రెంజల్/ మోపాల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 18 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ సోమవారం తెలిపారు. గత ఎన్నికల్లో కేసు నమోదైన వారిని గుర్తించి ముందస్తుగా బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

మోపాల్ మండలంలో సిర్‌పూర్, ఎల్లమ్మకుంట గ్రామాలకు చెందిన 17 మందిని తహసీల్దార్ ఖాజా ఖ ద్బుద్దీన్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఏఎస్సై దయాళ్‌సింగ్ సోమవారం తెలిపారు. వీరిపై గ తంలో కేసులు నమోదు కాగా, పాత నేరస్తులుగా పరిగణించి బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

నందిపేట్: ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరి నిందితులకు ఆర్మూర్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వేముల దీప్తి ఒక సంవత్సరం జైలు శిక్షను విధించినట్లు ఎస్సై రాహుల్ సోమవారం తెలిపారు. మండలంలోని చౌడమ్మ గ్రామంలో ఉన్న పెద్దమ్మ ఆలయంలో గత సంవత్సరం నిందితులు చోరీకి పాల్పడ్డారు. విచారణలో కంఠం గ్రామానికి చెందిన లింగం, దేవేందర్‌పై నేరం రుజువు కావడంతో జడ్జి శిక్షను అమలు చేసినట్లు తెలిపారు.

శక్కర్‌నగర్‌లో ఒకరి ఆత్మహత్య

బోధన్‌టౌన్: పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీకి చెందిన గుండబోయిన స్వామి (45) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్ సోమవారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

రైలు కింద పడి మరొకరు..

కామారెడ్డి క్రైం: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి రైల్వే పీఎస్ పరిధిలోని వడియారం రైల్వే స్టేషన్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఘటనా స్థలాన్ని ఎస్సై తావ్రూ నాయక్ పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని చెప్పారు. ఎవరైనా మృతుడిని గుర్తిస్తే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.